క్లుప్తంగా

నేడు అద్దేపల్లిలో ఆరోగ్య సురక్ష శిబిరం

భట్టిప్రోలు: భట్టిప్రోలు–2 సచివాలయం పరిధిలోని అద్దేపల్లి ఎంపీయుపీ స్కూల్ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జెబీవీ మల్లికార్జునరావు గురువారం తెలిపారు. ఈ శిబిరంలో పీహెచ్‌సీల వైద్యులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ స్పెషలిస్ట్ డాక్టర్లు, కంటి వైద్య నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కరి, సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు రావు రాజేశ్వరి, కోఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని వివరించారు. వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ఈ క్యాంప్‌లో పాల్గొంటారని సర్పంచ్ దారా రవికిరణ్మయి తెలిపారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్లాలి




వెల్లటూరు(భట్టిప్రోలు): విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్లాలని అప్పుడే పరీక్షల్లో సత్ఫలితాలు సాధిస్తారని పలువురు వక్తలు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు గురువారం 'ప్రేరణ తరగతుల వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించారు. హైస్కూల్ నుంచి పరీక్షలకు హాజరవుతున్న 90 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన దాతలు కంచర్ల నిర్మల బాబు, కంచర్ల సుజాతలు రూ.10 వేలు వ్యయం చేసే పరీక్ష సామాగ్రి కిట్లను అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ పూర్వ హెచ్‌ఎం కనపర్తి నిరీక్షణ రావు, ప్రస్తుత హెచ్‌ఎం కె. అరుణకుమారి, ఎస్‌ఎంసీ చైర్మన్ చందు సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బండ్లమ్మ ఆలయంలో బహిరంగ వేలం



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు బండ్లమ్మ దేవాలయంలో వంట సామాగ్రి, టెంట్ సామాగ్రి హక్కుల కోసం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ బండ్లమ్మ దేవాలయంలో కల్యాణ మండపంలో జరుగు కార్యక్రమాలకు అవసరమైన సామాన్లు, కుర్చీలు, సరఫరా చేయుటకు గాను లైసెన్సు పొందుటకు బహిరంగ వేలం నిర్వహించినట్లు తెలిపారు. వేలంలో హెచ్చు పాటదారునిగా కుంచలవారిపాలెం గ్రామానికి చెందిన కుంచల జయరెడ్డి రూ.68 వేలకు అనుమతులు పొందినట్లు చెప్పారు. గతంలో పాట కంటే ఈ సారి అదనంగా రూ.33 వేలు అధికంగా ఆదాయం లభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ బాపట్ల డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, సభ్యులు బుడ్డా వెంకట లక్ష్మి, తుమ్మా జోగేశ్వర రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



పేరలి(కర్లపాలెం): విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ప్రముఖ సంఘ సేవకులు మోపర్తి జాన్ సూచించారు. కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, ప్రముఖ సంఘ సేవకులు మోపర్తి జాన్ గురువారం పేరలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లతో కూడిన కిట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉన్నత చదువులకు వెళ్లాలని తద్వారా తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పాఠశాల హెచ్‌ఎం అపర్ణ, మిషన్స్ డైరెక్టర్ స్టీవ్ కొలిన్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్

నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

నగరం: బీసీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రేపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. మండలంలోని చిరకాలవారిపాలెం గ్రామంలో గురువారం రాత్రి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి సీఎం జగన్ చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. బీసీలకు అధిక ప్రాధాన్యతను కల్పించి ఉన్నత స్థాయిలో నిలబెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. బీసీలంతా వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారన్నారు. ఎన్ని పార్టీలు కలిసినా వైఎస్సార్ సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ ఈవూరి

కార్యక్రమంలో డాక్టర్ కేశవతి, డాక్టర్ సృజన్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కాటూరి శివనాగబాబు, విచారపు ప్రేమ్‌సుధాకర్, నాంచారయ్య, చింతయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



రేపల్లె రూరల్: వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. వేసవిలో తాగునీటి సరఫరాపై అధికారులతో నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించటం జరుగుతుందన్నారు. ఆయా ప్రాంతాలలో సైతం ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయటం జరుగుతుందన్నారు. పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రజలు పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కౌన్సిలర్‌లు నిరంతరం తమ వార్డులలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవాలన్నారు. వార్డులలో పారిశుద్ధ్యం పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలన్నారు. అనంతరం ఎజెండాలోని 17 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ శేషాద్రి, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

బాపట్ల జిల్లా వ్యవసాయ సంచాలకులు వై రామకృష్ణ

చెరుకుపల్లి: ప్రతి గ్రామంలో రైతుల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల జిల్లా వ్యవసాయ సంచాలకులు వై రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కావూరు రైతు భరోసా కేంద్రాన్ని రేపల్లె వ్యవసాయ సహాయకులు ఎస్‌డీ అక్తర్ హుసేన్ తో కలసి సందర్శించి రైతులతో మాట్లాడారు. గ్రామాల్లోని ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్న ఎరువులు, పురుగు మందుల విత్తనాలు మరియు అన్ని సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ–పంట నమోదు, ధాన్యం కొనుగోలు, పంటల యాజమాన్య పద్ధతులు రైతులకు మరింత చేరువలో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో విఏఏలు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.



ఆర్‌బీకేలో రైతులతో మాట్లాడుతున్న రామకృష్ణ

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీల్లో పలువురికి చోటు

రేపల్లె రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించిన జిల్లా కమిటీలలో రేపల్లె నియోజవకర్గానికి చెందిన పలువురికి స్థానం లభించింది. బాపట్ల జిల్లా మైనార్టీ విభాగం కమిటీలో రేపల్లెకు చెందిన పలువురికి పదవులు దక్కాయి. జిల్లా మైనార్టీ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ అలీబుడా, జనరల్ సెక్రటరీగా షేక్ అన్వర్, జాయింట్ సెక్రటరీగా అబ్దుల్ మైమూద్, కార్యదర్శులుగా షేక్ మునీర్, షరీఫ్‌బేగ్‌లు నియమితులయ్యారు.

జిల్లా యువజన విభాగానికి పలువురి ఎంపిక

వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా యువజన విభాగంలో రేపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు ఎంపికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా నల్లగుర్ల దేవీ ప్రసాద్, జనరల్ సెక్రటరీగా కొలగాని శ్రీనివాసరావు, సెక్రటరీలుగా దొంతిబోయిన ఏడుకొండలు రెడ్డి, కొక్కిలిగడ్డ ప్రశాంత్, జాయింట్ సెక్రటరీలుగా శీలం పూర్ణచంద్రశేఖరరెడ్డి, తూనుగుంట్ల సుమన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా డి.నాగమల్లేశ్వరరావు, పూర్ణ శివనాగ దుర్గా వెంకటేశ్వరరావులు నియమితులయ్యారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

రేపల్లెరూరల్: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగ పడుతుందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని పిరాట్లంక గ్రామానికి చెందిన ధూళిపాళ్ల శోభన్‌బాబుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.56 వేల చెక్కును గురువారం పట్టణంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. మోళ్లగుంట గ్రామానికి చెందిన విశ్వనాథపల్లి శ్రీనివాసరావుకు వారి పిల్లల చదువులకై రూ.50 వేలను వ్యక్తిగత సాయంగా అందజేశారు. కార్యక్రమంలో పిరాట్లంక మాజీ సర్పంచ్ ధూళిపాళ్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న మోపిదేవి

హిందూధర్మ పరిరక్షణకు ముందుకు రండి

చెరుకుపల్లి: హిందూధర్మ పరిరక్షణలో మహిళలే ముందుకువచ్చి కీలక పాత్ర పోషించాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి అన్నారు. మండలంలోని గుళ్లపల్లి శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవస్థానంలో గురువారం సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారయణ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు కాపాడటంలో మహిళలే కీలక పాత్ర వహించాలని కోరారు. ఈ నెల 25, 26 తేదీలలో పౌర్ణమి సామూహిక హారతులు అన్ని దేవాలయాల్లో జరిగేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సమన్వయ ప్రముఖ్ యల్లాప్రగడ సీతాపతి, పడమట వెంకటేశ్వరరావు, బొలగాని వెంకటేశ్వర్లు, ఉల్లంగుంట సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



రేపల్లె రూరల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని పట్టణ సీఐ నజీర్‌బేగ్ కోరారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లను చైతన్య పరిచేందుకు మండలంలోని గుడ్డికాయలంక, బేతపూడి గ్రామాలలో గురువారం నిర్వహించిన కవాతు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక దృష్టి సారించటం జరుగుతుందన్నారు. వజ్రాయుధం వంటి ఓటు హక్కును ఓటర్లు సద్వినియోగం చేసుకొని ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

కర్లపాలెం: పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపీపీ యారం వనజ తెలిపారు. పేరలిపాడు గ్రామంలో గురువారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. పౌష్టికాహార ఆవశ్యకతపై బాలింతలు, గర్భిణీలకు అవగాహన కల్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ పౌష్టికాహార లోపం వలన అత్యధిక శాతం మహిళల్లో రక్తహీనత ఏర్పడుతుందని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు చిరుధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని మౌనిక, కార్యదర్శి కాంచన, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యారం వనజ

పోషకాహారంపై అవగాహన

అళ్లమూడి(భట్టిప్రోలు): పోషకాహార లోపానికి గురైన పిల్లలను అంగన్‌వాడీ కార్యకర్తలు గుర్తించి అనుబంధ పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫజరున్నీస్సా పేర్కొన్నారు. అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పల్లెకోన సెక్టార్ పరిధిలోని అళ్లమూడిలో గురువారం పోషణ్ పఖ్వాడ్ కార్యక్రమం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ అనుబంధ పోషకాహారంపై గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మద్దతు ధరల చట్టం కోరుతూ ప్రదర్శన

తెనాలి: రైతులు పండించే పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని, రైతు రుణాలను మాఫీ చేయాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని కోరుతూ సీఐటీయూ, ఆంధ్ర ప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ప్రదర్శన చేశారు. స్థానిక మార్కెట్ సెంటర్లో జరిగిన ప్రదర్శన నుద్దేశించి సీఐటీయూ జిల్లా నాయకుడు కె.బాబూప్రసాద్ మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరుగుతున్న భారీ బహిరంగ సభకు మద్దతుగా పట్టణంలో సంఘీభావ ప్రదర్శన చేపట్టినట్టు చెప్పారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు సీ2 ప్లస్ 50 శాతం ఫార్ములా అమలుచేయాలని, రైతుల అప్పులు రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసించాలని కోరారు. ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్ వలి, మంగళగిరి వెంకటేశ్వర్లు, చుక్కపల్లి శేషగిరి రావు, ముత్యాల సుభద్ర, బండి రమణమ్మ, పిల్లి సుహాసిని, రైతు నాయకులు ముద్దన సాంబశివ రావు, మాగంటి యల్లమందయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్మరణ.. అందరి బాధ్యత

తెనాలిటౌన్: పోలీసు కాల్పులలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులను స్మరించుకోవడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని గరువుపల్లిలోని సచివాలయం–2 వద్ద బుధవారం రాత్రి అమరవీరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో 1968లో జరిగిన పోలీసు కాల్పుల్లో మృతి చెందిన మంచికలపూడి సుబ్బారావు, మునిపల్లి క్రిష్టాఫర్ లను స్మరించుకుంటూ పల్లె తొలితరం పోరాట యోధులకు పలువురు నాయకులు, వక్తలు జోహార్లు అర్పించారు. సామాజిక వేత్త ఉన్నం లక్ష్మయ్య అధ్యక్షత జరిగిన సభలో ఆ రోజుల్లో జరిగిన సంఘటనలు, కుల వ్యవస్థ గురించి పలువురు వక్తలు ప్రసంగించారు. కళల కాణాచి కొలకలూరు చరిత్ర గురించి డాక్యుమెంటరీ రూపంలో తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు.

కర్రసాము, కత్తిసాము, నాట కాలు, డప్పు కళాకారులు, కబడ్డీ, క్రీడాకారులు, కవులు, కళాకారులు, రచయితలకు నిలయమైన కొలకలూరు గురించి రాబోయే తరాలను తెలియజేయడానికి అందరూ సహకరించాలని కోరారు. ఎఎస్‌యు ప్రొఫెసర్ డాక్టర్ పీజే రత్నాకర్, బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి యంగ్రపాటి అశోక్ కుమార్, దళిత నాయకుడు సాంబశివరావు, విశ్రాంత పోస్టల్ ఉద్యోగి సుద్దపల్లి శరత్ వెంకయ్య, కళాకారుడు మోపర్తి డేవిడ్ రాజులు ప్రసంగించారు.



సభలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

సభాధ్యక్షులు లక్ష్మయ్య విశ్లేషణ చేయగా న్యాయవాది మురళీధర్ సభా పరిచయం చేయగా ఐవోసీ డీలర్ యడ్లపల్లి రవికిరణ్, వందన సమర్పణ చేశారు. కార్యక్రమాన్ని ఆహ్వాన కమిటీ సభ్యులు కొలకలూరి పాపరావు, సుద్దపల్లి కనకరాజు, శీలం వినయ్‌కుమార్, కోడూరు సుదర్శనబాబు, పొన్నెకంటి చక్రవర్తి, అంబేడ్కర్‌లు పర్యవేక్షించారు.

వలంటీర్, సచివాలయ వ్యవస్థతో సుస్థిర పాలన

వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సంక్షేమం అందుతుందని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకష్ణ అన్నారు. గతంలో టీడీపీ ప్రవేశపెట్టిన జన్మభూమి కమిటీలతో ఆ పార్టీ పతనం మొదలైందని పేర్కొన్నారు. గురువారం నిడుబ్రోలులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన హాజరయ్యారు. సభకు పార్టీ నాయకులు నన్నపనేని అంకినీడు చౌదరి అధ్యక్షత వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే చిట్టినేని వెంకట్రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నూతన పాలకవర్గ చైర్మన్ రావిపాటి మురళీకష్ణ, పాలకవర్గ సభ్యులు కొండముది కమలాకర్ రావు, షేక్ సైదా ప్రమాణం చేశారు. సమన్వయకర్త మురళీకష్ణ మాట్లాడుతూ 2023వ సంవత్సరంలో రూ.45 కోట్లు రుణాలు ఇచ్చిన నిడుబ్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కర్లపూడి రమేష్, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బొనిగల వేణు ప్రసాద్, బొద్దులూరి రంగారావు, వడ్రాణం ప్రసాదరావు, షేక్ నాజర్, కోట శ్రీనివాస రావు, పెరికల కృష్ణమోహన్, భవనం వంశీ రెడ్డి, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుంటూరు జిల్లా సేవాదళ్ కార్యదర్శిగా నియమితులైన వేముల మూర్తి రాజు, జిల్లా వికలాంగుల విభాగ కార్యదర్శిగా నియమితులైన కాట్రగడ్డ విజయకుమార్‌లను పొన్నూరు మురళీకృష్ణ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



సభలో మాట్లాడుతున్న సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

మంచి చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

పొన్నూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరోసారి అధికారం అందించేలా ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ కోరారు. గురువారం పట్టణంలోని పార్టీ ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. మురళీకృష్ణ పలువురు నాయకుల ఇంటికి వెళ్లడంతో వారు ఆత్మీయంగా ఆహ్వానం పలికారు. పార్టీ ముఖ్య నాయకులు సహస్ర లింగేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ నాగ సూరి ప్రతాప్, మాజీ కౌన్సిలర్ మహమ్మద్ జిలాని, ఆడిటర్ పులిపాక వెంకట సత్యసాయి వరప్రసాద్, పఠాన్ బాబు ఖాన్ లను కలిశారు. నాలుగో వార్డ్‌లోని మటన్ మార్కెట్‌లో మటన్ కొట్టి వ్యాపారులతో సందడి చేశారు. సంక్షేమ పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వర రావు, వైఎస్ఆర్ సీపీ నాయకులు షేక్ నాజర్, వడ్రాణం ప్రసాదరావు, కోటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎథికల్ స్టెప్స్‌పై అవగాహన

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఐటీ విద్యార్థినులకు హక్ బోట్స్ ఆధ్వర్యంలో స్టార్ట్ అప్ ప్లానింగ్, లీగల్, ఎథికల్ స్టెప్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హక్‌బోట్స్ సీఈవో ఎస్ఆర్‌కే మహేష్, స్టార్టప్ ఐడియాస్ నిపుణుడు టి.ప్రసాద్‌లు హాజరయ్యారు. ప్రోడక్ట్ ఇన్నోవేషన్స్, మ్యానుఫ్యాక్చర్ లెవ ల్స్, ఇన్వెస్ట్‌మెంట్ లెవల్స్, క్రియేటివ్ ఇన్నోవేషన్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు, ప్రిన్సిపల్ జె. అప్పారావు, డీన్ కిషోర్‌బాబు, రమేష్ బాబు, అధిపతులు పాల్గొన్నారు.

తెనాలిలో డీఆర్ఎం ఆకస్మిక తనిఖీ

తెనాలిరూరల్: తెనాలి రైల్వేస్టేషన్‌ను విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఆనంద్‌రావ్ పాటిల్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా వచ్చిన ఆయన సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కార్యాలయం, ఇతర రైల్వే విభాగాల కార్యాలయాలు, ఉత్తర క్యాబిన్, స్టేషన్‌లోని ప్లాట్ ఫాంలతో పాటు రైల్వే ట్రాక్‌లను పరిశీలించారు. స్టేషన్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను ఆరా తీశారు. ప్రయాణికుల భద్రత కోసం రైల్వే ట్రాక్‌ల పునరుద్ధరణ, తెనాలి నుంచి గుంటూరు వెళ్లే రైలు మార్గం అభివృద్ధి చేసే అంశాలను అధికారులతో చర్చించారు. ఆయన వెంట స్టేషన్ మేనేజర్ టి.వెంకటరమణ ఉన్నారు.

27న తెనాలిలో డాక్ అదాలత్

తెనాలిఅర్బన్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెనాలి కొత్తపేటలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈనెల 27న డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ శాంతి రవికిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తపాలా సేవలు అందుకునే విషయంలో ఏమైనా ఫిర్యాదులు ఉంటే డాక్ అదాలత్ తెలియజేసి పరిష్కారం పొందవచ్చని చెప్పారు. సాయంత్రం 4.30గంటల నుంచి డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. వ్యక్తిగతంగా ఫిర్యాదు చేయడానికి అవకాశం లేని వారు ఈ నెల 25 తేదీలోపు ది సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ తెనాలిడివిజన్, తెనాలి–522201 చిరునామా ద్వారా లేటర్ పంపవచ్చని వివరించారు.

చిన్నారుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రత్తిపాడు: చిన్నారుల్లో వయసుకు తగిన బరువు ఉండాలని అప్పుడే ఆరోగ్యంగా ఉన్నట్లుగా భావించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.అరుణ అన్నారు. పోషణ్ పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రత్తిపాడు యాదవపాలెం అంగన్‌వాడీ కేంద్రంతో పాటు గొట్టిపాడు సెక్టార్‌లోని తిక్కిరెడ్డిపాలెం కేంద్రాల్లో గర్భవతులు, బాలింతలు, మహిళలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే గ్రోత్ మోనిటరింగ్‌పై తల్లులకు వివరించారు.